క్లుప్తంగా

జీవాలకు సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు

రేగడిదోసాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి



తిమ్మారెడ్డిగూడలో గొర్రెలకు టీకాలు వేస్తున్న సిబ్బంది

షాబాద్: జీవాలకు సీజనల్ వ్యాధులు రాకుండా ప్రభుత్వం ముందస్తుగా చర్యలు తీసుకుంటుందని రేగడిదోసాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా శనివారం మండల పరిధిలోని తిమ్మారెడ్డి గూడ, రుద్రారం గ్రామాల్లో చిటుక వ్యాధి నివారణ టీకాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సీజన్‌లో గొర్రెలు, మేకలకు వచ్చే వ్యాధులపై కాపరులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతీ రైతు తమ జీవాలకు టీకాలను విధిగా వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు, పశువైద్య సిబ్బంది తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్‌రూరల్: ఎస్సీ గురుకులాల సొసైటీ పరిధిలోని నాన్ సీఈఓ విద్యాలయాల్లో 2024–25 విద్యా సంవత్సరానికి జూనియర్ ఇంటర్‌లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చేవెళ్ల గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. గురుకులాల సొసైటీ కార్యదర్శి కె.సీతాలక్ష్మి ఆధ్వర్యంలో దరఖాస్తులు కోరుతున్నామని, పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 31 వరకు గురుకుల సొసైటీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. విద్యార్థులు దరఖాస్తు చేసుకునే గ్రూప్‌లు ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ కోర్సుల్లో సీట్లు ఉన్నాయని తెలిపారు. దరఖాస్తు రుసుము కింద ఆన్‌లైన్‌లో రూ.100 చెల్లించాలని కోరారు.

ఆర్థికసాయం

కేశంపేట: మండల పరిధిలోని సంతాపూర్ గ్రామంలో వడదెబ్బ కారణంగా శుక్రవారం కొరమోని అంజయ్య మృతి చెందాడు. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిమిత్తం షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వర్కాల లక్ష్మీనారాయణగౌడ్ రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సాజిద్‌లు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నందిగామ: మండల పరిధిలోని రంగాపూర్, చాకలిగుట్టతండా గ్రామ పంచాయతీ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ శ్రీధర్ శనివారం ఒక ప్రకటన లో తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా విద్యుత్ తీగల వద్ద చెట్ల కొమ్మలు తొలగిస్తున్న కారణంగా ఉద యం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన వివరించారు. ఆయా గ్రామాల ప్రజలు, వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

షాద్‌నగర్ మండల పరిధిలో..

షాద్‌నగర్: షాద్‌నగర్‌లోని 33కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో ఉన్న విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉన్న చెట్లకొమ్మలను తొలగిస్తున్న కారణంగా మండలంలోని పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో పట్టణ ఏఈ వినోద్ తెలిపారు. మండల పరిధిలో ఎలికట్ట, మహల్ ఎలికట్ట, మొగిలిగిద్ద, కందివనం , ఎల్లంపల్లి, మహ్మద్ అలీగూడెం, రంగంపల్లి, గ్రామాలతో పాటు ఎలికట్ట ఇండస్ట్రీయల్ ప్రాంతంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మొయినాబాద్ మండల పరిధిలో..

మొయినాబాద్: మండల పరిధిలో విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్లకొమ్మల తొలగింపు కారణంగా ఆదివారం చిన్నమంగళారం ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు, వీరన్నపేట ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ అధికారి రాజేశ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల రైతులు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మంద కృష్ణను కలిసిన జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్

చేవెళ్ల: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగను ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కాడిగల్ల ప్రవీణ్‌కుమార్ మాదిగ మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసిన ప్రవీణ్‌కుమార్ పలు రాజకీయ సామాజిక అంశాలపై చర్చించినట్లు తెలిపారు. త్వరలో రాబోయే ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని మంద కృష్ణ సూచించినట్లు ఆయన తెలిపారు.

అన్ని సేవలూ అక్కడే..

మూడు పీఏసీఎస్‌లు, రెండు పీహెచ్‌సీలు నందిగామలో	సేవల కోసం పక్క మండలానికి వెళ్లాల్సిన పరిస్థితి	ఇబ్బంది పడుతున్న రైతులు, ప్రజలు	స్థానికంగా ఏర్పాటు చేయాలని డిమాండ్



నందిగామలో కొనసాగుతున్న పీఏసీఎస్ కేంద్రం



నందిగామ మండల పరిధిలో ఉన్న కొత్తూరు పీహెచ్‌సీ

కొత్తూరు: మండలాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా కొత్తూరు మండలంలో కొనసాగిన మేజర్ గ్రామ పంచాయతీ నందిగామను ఎనిమిదేళ్ల క్రితం నూతన మండలముగా ఏర్పాటు చేశారు. కాగా ఏళ్లు గడుస్తున్నా కార్యాలయాలను మాత్రం ప్రజలకు అనుకూలంగా ఏర్పాటు చేయలేదు. దీంతో ఇప్పటికీ మూడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు(పీఏసీఎస్), రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ)లు కొత్తగా ఏర్పాటైన నందిగామ మండలంలోనే ఉన్నాయి. ఆయా పనుల నిమిత్తం అసవరం ఉంటే ప్రజలు, రైతులు కొత్తగా ఏర్పాటైన మండలానికే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కేవలం సంఖ్యాపరంగా కొత్త మండలాలు చేశారే తప్పా పూర్తిస్థాయిలో పాలనపరమైన చర్యలు తీసుకోవడంలో ఇప్పటికీ పాలకులు, ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. అంతేకాకుండా కొత్తగా ఏర్పాటైన నందిగామ మండలంలో ఇప్పటికీ ప్రత్యేకంగా ఏంఈఓ, ఏఓ, ఇతర శాఖలకు చెందిన కార్యాలయాలు ఏర్పాటు కాలేదు. అధికారులను నియమించలేదు. పాత వారినే ఇన్‌చార్జిలుగా కొనసాగిస్తున్నారు.

రెండు పీహెచ్‌సీలు నందిగామలోనే..

గతంలో కొత్తూరు మండలంలో పారిశ్రామికవాడ, జాతీయ రహదారి ఉండడంతో ఆయా ప్రమాదాల్లో గాయపడిన వారికి తక్షణమే చికిత్సలు అందించాలనే ఉద్దేశంతో కొత్తూరు, నందిగామలో రెండు పీహెచ్‌సీలను ఏర్పాటు చేశారు. కాగా మండలాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా రెండు పీహెచ్‌సీలు కాస్త నందిగామ మండల పరిధిలోకే వెళ్లాయి. ప్రస్తుతానికి నందిగామ మండలం రంగాపూర్ గ్రామంలో ఉన్న పీహెచ్‌సీకే కొత్తూరు మండలానికి చెందిన రోగులు వెళ్తున్నారు. కొత్తూరు మండలంలో 32 వేలకు పైగా జనాభా ఉన్నట్లు అధికారుల లెక్కలు తెలుపుతున్నాయి.

మూడు పీఏసీఎస్‌లు పక్క మండలంలోనే..

ప్రస్తుతం నందిగామ మండలంలోని మేకగూడ, చేగూరు, నందిగామ మండల కేంద్రాల్లో మూడు (పీఏసీఎస్)లు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు కొనసాగుతున్నాయి. కొత్తూరు మండలంలో మాత్రం ఒక్క సంఘం కూడా లేదు. మండలాలు మారి ఎనిమిదేళ్లు గడుస్తున్నా రైతులు సేవలు మాత్రం పాత కార్యాలయాల నుంచే పొందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు అందుబాటులో కార్యలయాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అయోమయంలో ప్రజలు

పీహెచ్‌సీలు, పీఏసీఎస్‌లు రెండు నందిగామ మండలంలోనే కొనసాగుతుండడంతో వాస్తవానికి కొత్తూరు మండలం నుంచి నందిగామ వేరుపడి కొత్త మండలంగా మారిందా..? లేదా అనే అయోమయంలో ప్రజలు, రైతులు ఉన్నారు. వారి అయోమయాన్ని నిజం చేస్తున్నట్లుగా కొత్త మండలం ఏర్పాటై ఎనిమిదేళ్లు గడుస్తున్నా కార్యాలయాలు మాత్రం వేరుపడలేదు. ఇప్పటికీ పనుల నిమిత్తం పాత కార్యాలయాలకే వెళ్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి కొత్తూరు మండల పరిధిలో పీహెచ్‌సీ, పీఏసీఎస్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నందిగామలోనే పీఏసీఎస్‌లు కొనసాగుతున్నాయి



ప్రస్తుతం మూడు పీఏసీఎస్ కేంద్రాలు నందిగామ మండలంలోనే కొనసాగుతున్నాయి. కొత్తూరు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు నందిగామ, మేకగూడ, చేగూరు గ్రామాల్లోని పీఏసీఎస్ కేంద్రాల్లోనే ఇప్పటికీ విత్తనాలు, ఎరువులు తీసుకుంటున్నారు.

- గోపాల్, ఏఓ, కొత్తూరు

గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

డీపీఓ సురేశ్‌మోహన్



దొంతాన్‌పల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న డీపీఓ సురేశ్‌మోహన్, తదితరులు

చేవెళ్ల: గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని డీపీఓ సురేశ్‌మోహన్ అన్నారు. శంకర్‌పల్లి మండలంలోని దొంతాన్‌పల్లి, మహారాజ్‌పేట్ గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఉన్న పల్లె ప్రకృతివనాలు, గ్రామీణ క్రీడా ప్రాంగణాలు, డంప్‌యార్డులు, నర్సరీలు, వైకుంఠధామాలను ఆయన పరిశీలించారు. గ్రామాల్లో నర్సరీలు, డంప్‌యార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవటంతో ఆయా గ్రామాల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాలపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. గ్రామాల్లో ఉన్న ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. గ్రామాల్లో తడి, పొడి చెత్తను రోజువారీగా సేకరించాలన్నారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి రోజు గ్రామంలోని సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం అందించే కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. ఆయన వెంట ఎంపీడీఓ వెంకయ్య, ఎంపీఓ గీత, ఏపీఓ నాగభూషణం, ఆయా గ్రామాల కార్యదర్శులు, గ్రామస్తులు ఉన్నారు.

మట్టి తరలిస్తున్న వాహనం సీజ్

కేశంపేట: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్ వాహనంతో పాటు హిటాచీపై కేసు నమోదు చేసిన సంఘటన మండల పరిధిలో శనివారం చోటు చేసుకుంది. మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామ శివారు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్‌తో పాటు హిటాచీ వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. కానిస్టేబుల్ భీమరాజు ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్ యాదగిరి, హిటాచీ ఆపరేటర్ రవిలతో పాటు వాహనాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ నర్సింలు శెట్టి తెలిపారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



దుకాణంలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఏఓ సురేశ్‌బాబు

చేవెళ్ల: నకిలీ నిషేధిత విత్తనాలు ఎవరైనా అమ్మినట్లు తెలిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని శంకర్‌పల్లి మండల వ్యవసాయాధికారి సురేశ్‌బాబు అన్నారు. శనివారం శంకర్‌పల్లి మండల కేంద్రం, మండలంలోని సంకేపల్లి గ్రామంలో ఉన్న ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాల్లో ఉన్న విత్తనాల స్టాక్ రిజిస్టార్లను, సీడ్స్‌ను పరిశీలించారు. విత్తనాలకు రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఎప్పటికప్పుడూ స్టాక్ రిజిస్టార్‌లో స్టాక్ వివరాలు నమోదు చేయాలన్నారు. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవన్నారు. నాణ్యమైన కంపెనీ విత్తనాలనే రైతులకు విక్రయించాలని సూచించారు. ప్రతి దుకాణం ముందు దుకాణంలో ఉన్న సీడ్స్ విత్తనాల వివరాలు, వాటి ధరలతో ఉన్న బోర్డులు పెట్టాలని తెలిపారు.

చరిత్రలో నిలిచిపోయేలా ఆవిర్భావ వేడుకలు

మాజీ ఎంపీ డాక్టర్ మల్లురవి



మాట్లాడుతున్న మల్లురవి

ఆమనగల్లు: రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తుందని పీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ డాక్టర్ మల్లురవి పేర్కొన్నారు. జూన్ 2న పరేడ్ గ్రౌండ్‌లో జరిగే రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ హాజరవుతున్నారని ఆయన చెప్పారు. ఆమనగల్లు పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ఈసీ అనుమతి ఇచ్చిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. 6 దశాబ్దాల తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర కలను సాకారం చేసిన ఘనత సోనియాగాంధీదే అని ఆయన అన్నారు. ఈ వేడుకల నేపథ్యంలో సోనియాగాంధీని ముఖ్య అతిథిగా ఆహ్వానించి రాష్ట్ర ప్రభుత్వం తరపున సన్మానించనున్నట్లు ఆయన చెప్పారు. సమావేశంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా పాల్గొన్నారు.

విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు అవసరం



చేవెళ్ల: ఇబ్రహీంపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

చేవెళ్ల: వానాకాలం సీజన్‌కు అవసరమయ్యే విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని చేవెళ్ల డివిజన్ వ్యవసాయ అధికారిణి(ఏడీఏ) రమాదేవి తెలిపారు. మండలంలోని ఇబ్రహీంపల్లి, దేవునిఎర్రవల్లి గ్రామాల్లో శనివారం రైతులకు విత్తనాల కొనుగోళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వ్యవసాయాధికారులు మాట్లాడుతూ.. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో లూజుగా ఉన్న సంచుల్లో గల విత్తనాలను కొనుగోలు చేయొద్దని తెలిపారు. విత్తనాలు కొనుగోలు చేసే దుకాణంలో తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని సూచించారు. రైతు పొలంలో వేసే విత్తనాలకు సంబంధించిన విత్తన ప్యాకెట్‌ను, బిల్లును పంటకాలం పూర్తయ్యేవరకు జాగ్రత్తగా పెట్టుకోవాలన్నారు. తప్పనిసరిగా వ్యవసాయశాఖ ద్వారా గుర్తింపు పొందిన అధీకృత డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ తులసి, ఏఈఓలు రమేశ్, ఇబ్రహీంపల్లి, దేవునిఎర్రవల్లి గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

రశీదులు తప్పనిసరి..

కొత్తూరు: విత్తనాల ఎంపికలో రైతులు జాగ్రత్తలు అవసరమని ఏఓ గోపాల్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మండలంలోని పెంజర్ల గ్రామంలో శనివారం రైతులకు విత్తనాల ఎంపిక, పంటల సాగుపై అవగాహన కల్పించారు. దుకాణాల్లో రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు తప్పకుండా రశీదులు తీసుకోవాలని కోరారు. అంతేకాకుండా విత్తనాలను సీల్డు ప్యాకెట్లలోనే కొనుగోలు చేయడంతో పాటు పంటలు పూర్తయ్యే వరకు ప్యాకెట్లను భద్రపరుచుకోవాలన్నారు. ముఖ్యంగా రైతులు ప్రభుత్వ గుర్తింపు పొందిన దుకాణాల్లోనే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని సూచించారు. నకిలీ విత్తనాలు, అనుమతి లేని ఎరువులు విక్రయించడం నేరమన్నారు. అలాంటి విక్రయాలు జరిగితే రైతులు తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ దీపిక, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సూచనలతో కొనుగోలు చేయాలి

మొయినాబాద్‌రూరల్: గ్రామాల్లోని రైతులు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో విత్తనాలు కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ అధికారిణి రాగమ్మ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని బాకారం, ఎన్కెపల్లి, నక్కలపల్లి, ఎత్‌మార్‌పల్లి గ్రామాల్లో రైతులు విత్తనాల కొనుగోలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారిణి రాగమ్మ మాట్లాడుతూ.. రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణం నుంచి రశీదు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో రైతులు దారెడ్డి కష్టారెడ్డి, సత్యనారాయణగౌడ్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద కొనుగోలు చేయాలి

కేశంపేట: రైతులు విత్తనాలను లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ అధికారి శిరీష అన్నారు. మండల పరిధిలోని అల్వాల, కేశంపేట గ్రామాల్లో శనివారం విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించారు. కొనుగోలు చేసిన విత్తనాల ప్యాకెట్‌పై గడువు కాలాన్ని పరిశీలించాలన్నారు. విత్తనాలను బ్లాక్‌లో విక్రయిస్తే వ్యవసాయ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు వినయ్, సుధా, లలిత, సంయుద్దీన్, సమీనా, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: వచ్చే వర్షాకాలంలో ప్రజలకు కావాల్సిన మొక్కలు ఎదిగి ఉండాలని ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామాన్ని ఆయన సందర్శించి పంచాయతీ కార్యదర్శి రంజిత్‌కుమార్‌తో కలిసి నర్సరీ, డంప్‌యార్డు, గ్రామంలోని రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతీ రోజు రోడ్లు, మురుగు కాల్వలు శుభ్రం చేయించాలని తెలిపారు. గ్రామంలోని చెత్తను డంప్‌యార్డుకు తరలించాలని రోడ్ల పక్కన చెత్త వేయకుండా చూడాలని సూచించారు. నర్సరీని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ వర్షాకాలానికి మొక్కలు ఏపుగా ఎదిగి ఉండాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్ ప్రకారం మొక్కలను పెంచాలని, అన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు నర్సరీలపై శ్రద్ధ చూపాలన్నారు. ప్రభుత్వ అధికారుల సూచనల మేరకు గ్రామాల అభివృద్ధిలో అందరూ పాలుపంచుకొని ప్రజలకు సమస్యలు రాకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో కారోబార్ శ్రావణ్‌కుమార్, రాఘవేందర్, సిబ్బంది రాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గోపూజ సకల దేవారాధనతో సమానం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



గోపూజ చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: గోమాతకు పూజ చేస్తే ఎంతో పుణ్యం లభిస్తుందని, సకల దేవుళ్లను పూజించినట్లేనని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని చటాన్‌పల్లి గ్రామం రాం నగర్ కాలనీలో ఉన్న గోమాత ఆలయంలో సురభి మాత కామదేను ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని గోవులకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోవులకు పూజలు చేయడం పురాతన కాలం నుంచి ఆచారంగా వస్తుందన్నారు. గోపూజ చేసిన వారికి పుణ్యం లభిస్తుందని, గోవులు ఎక్కడ సంతోషంగా ఉంటాయో అక్కడ పాడిపంటలతో సస్యశ్యామలంగా ఉంటుందని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చెంది తిరుపతిరెడ్డి, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, కౌన్సిలర్ శ్రీనివాస్, రవి కుమార్, అశోక్‌కుమార్, మాణిక్యం, శేఖర్, నందిగామ శేఖర్, రాజు, కుమార్, మహేశ్, అర్చకుడు సత్యం, నర్సింహా, నాగ సుదర్శనమ్మ, అరవిందదేవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

షాద్‌నగర్: ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం ఫరూఖ్‌నగర్ మండల నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంపాదించిన దానిలో కొంత మొత్తాన్ని పేదల సంక్షేమం కోసం ఖర్చు చేయాలన్నారు. ఆర్యవైశ్యులు సేవా కార్యక్రమాల్లో ముందుండాలని సూచించారు. ఈ సందర్భంగా పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన 40 మంది విద్యార్థులకు మెడల్స్, షీల్డ్‌లు అందజేసి ఘనంగా సన్మానించారు. మండల అధ్యక్షుడిగా ఎల్కుర్తి నారాయణ, ప్రధాన కార్యదర్శిగా బండారు శంకర్, కోశాధికారిగా బెజవాడ యశ్వంత్‌లు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో రవికుమార్‌గుప్తా, తాడేపల్లి వెంకటేశ్, గందె సురేష్, కిరణ్, లక్ష్మీనారాయణ, వెంకటేశ్‌గుప్తా, యాదగిరి, మురళీ, జగదీశ్వర్, బెజుగం రమేశ్, యంసాని శ్రీనివాస్, జగన్మోహన్‌రావు, జగదీశ్వర్, రమేశ్, దొంతు పాండురంగయ్య, నర్సింహ్మగుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్‌లో శిక్షణ పొందడం అభినందనీయం

మొయినాబాద్‌రూరల్: పలు పాఠశాలల విద్యార్థినులు ఎన్ఎస్ఎస్ క్యాంపులలో పాల్గొని పదిరోజుల పాటు శిక్షణ పొందడం అభినందనీయమని సికింద్రాబాద్ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కర్నల్ సంగీతకుమారి, డిప్యూటీ కమాండెంట్ మేజర్ చాముండి మందాడిలు అన్నారు. మొయినాబాద్ మండలంలోని హిమాయత్‌నగర్ సమీపంలో ఉన్న పల్లవి ఇంటర్నేషనల్ పాఠశాలలో పదిరోజులుగా తెలంగాణ బాలిక బీఎన్ ఎన్‌సీసీ సికింద్రాబాద్ వారి ఆధ్వర్యంలో శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ నెల 16న ప్రారంభమైన శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు నేర్చుకున్న విద్యలను ప్రదర్శించారు. అనంతరం సంగీతకుమారి, చాముండి మందడిలు మాట్లాడుతూ.. ఈ శిక్షణ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. శారీరక శిక్షణ, డ్రిల్ పెరిమోరియల్ డ్రిల్, యోగా, మెడిటేషన్, త్రోబాల్, టాగ్ ఆఫ్ వార్ ఆటలతో కూడిన వైవిద్యలపై శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. ఒత్తిడి నిర్వహణ, మాదకద్రవ్యాల దుర్వినియోగం నివారణ, కేరియర్ కౌన్సెలింగ్, నాయకత్వం, జట్టు నిర్మాణం, పబ్లిక్ స్పీకింగ్, యువ వర్ధమాన క్యాడెట్‌లకు ఇవి తోడ్పడతాయని సూచించారు. క్యాంప్‌లో ఫైరింగ్, టెంట్ పిచింగ్, ఆత్మరక్షణ, నిరాయుధ పోరాటం, జెండా ఏరియా తయారీ తదితర పోటీలు ఆకర్షణగా నిలిచాయన్నారు. విద్యార్థులు నేర్చుకున్న విద్యలను ప్రదర్శించడంతో వారిని అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



క్యాంప్‌లో మార్చ్ ఫాస్ట్ నిర్వహిస్తున్న విద్యార్థులు